"ఒరే బుజ్జిగా! ఎన్నిసార్లు పిలవాలిరా? అన్నానికి రా! ఆ జెష్టను కూడా రమ్మను మింగటానికి!" అన్నది చుక్కమ్మ లోపలి నుంచి పెద్దగా.

బుజ్జిగాడు పుస్తకం మూసి లేచాడు. చొక్కా చివరతో ముక్కు తుడుచుకున్నాడు. వెనుతిరిగి గుమ్మంలో కూర్చుని ఉన్న అక్క వైపు చూశాడు.

పన్నెండేళ్ల చిన్నమ్మ కదలకుండా కూర్చుని ఉంది. పక్కనే కఱ్ఱ. ఆమె పిన్నమ్మ మాటలు విన్నది. అయినా లేవలేదు. ఆమె కళ్లల్లో నీళ్లు నిలబడుతున్నాయి.

బుజ్జిగాడు నెమ్మదిగా — "అక్కా! అమ్మ రమ్మంటున్నది అన్నానికి!" అన్నాడు.

చిన్నమ్మ వాడి వైపు చూసిందే కాని కదలలేదు.

రెండు భాగాలుగా చిన్న పాక. పడమటి పక్కన రెండడుగుల ఖాళీ స్థలం. చివర దడి. సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చాడు. ఎండ మాడ్చేస్తున్నది. వేడి గాలి విసురుగా వీస్తున్నది. చిన్నమ్మకు ఆకలవుతున్నది కాని లేవలేదు.

బుజ్జిగాడు అక్క దగ్గరకి వచ్చి, "రా, అక్కా! అన్నం తిందాం" అన్నాడు మళ్లీ.

చిన్నమ్మకు మనసు బాగాలేదు. అప్పుడే కాదు, ఈమధ్య కొద్ది రోజుల నుంచి అంతే. సంక్రాంతి పండుగ వెళ్లిన దగ్గరనుంచి అంతే. అంతకుముందు మనసు బాగుండేది. సవతి తల్లి ఇలా కసురుకునేది కాదు. ఆ సంక్రాంతి పండగతో తన రోజువారీ సంపాదనకు మద్యనిషేధం పుణ్యమా అని తెర పడింది.

లోపలి నుంచి మళ్లీ చుక్కమ్మ పెద్దగా — "ఏరా! ఏమైంది మీకు? రా రేం?" అని అరిచింది.

బుజ్జిగాడు భయంతో కదిలాడు. చిన్నమ్మ కూడా దేకుతూ వచ్చింది.

చుక్కమ్మ కోపంతో — "ఏం? ఎన్నిసార్లు పిలవాలి?" అని గర్జించింది.


సత్తుపళ్లెంలో ఉన్న రెండు ముద్దలు గబగబా తిని ఇవతలికి వచ్చింది చిన్నమ్మ.

దేకుతూ వెళ్లి చాపమీద కళ్లు మూసుకుని ముడుచుకుని పడుకుంది.

వెంకటయ్య పగలు రిక్షా వేసేందుకు వెళ్లిపోయాడు ఉదయమే. ఇహనో, ఇప్పుడో వచ్చి కాస్త ఎంగిలిపడి మళ్లీ రిక్షా తీసుకుని ఊరిమీద పోతాడు. ఇక ఏకంగా రాత్రికి రిక్షా యజమానికి అప్పజెప్పి రావడమే. చుక్కమ్మ ఆ చుట్టుపక్కల నలుగురైదుగురు ధనికుల ఇళ్లల్లో చాకిరీ చేసి వేణ్ణీళ్లకు చన్నీళ్లుగా కొంత సంపాదిస్తూ ఉంటుంది. బుజ్జిగాడు వీధి చివర మునిసిపల్ స్కూల్లో రెండో క్లాసు చదువుతున్నాడు. వాణ్ణి మొగుడూ పెళ్లా లిద్దరూ అపురూపంగా, అతి గారాబంగా చూసుకుంటారు. చిన్నమ్మ వెంకటయ్యకు మొదటి భార్య సంతానం. చిన్నప్పుడే కాళ్లు రెండూ పోయి అవిటిదై ఉండిపోయింది. కళకళలాడే చామన చాయ ముఖం, చక్కని కనుముక్కు తీరు. కాని అవిటిదై అందరికీ భారమైపోయింది. రెండేళ్ల


# చిన్నమ్మ నవ్వింది

వారం వారం కథాప్రభ



క్రితం వరకు చిన్నమ్మ ఇంట్లోనే అటూ ఇటూ దేకుతూ ఏమీ తోచక, ఎవరూ మాట్లాడేవారు లేక, సవతి తల్లి మాటలు భరించలేక బాధపడుతూ ఉండేది. కాని ఒకప్పుడు అప్పట్లో ఆ పిల్ల అదృష్టంకొద్దీ ఆ వీధిలో ఉండే ఒక మాస్టారు ఒక ఉపాయం చెప్పాడు.

కాస్త దూరంలో మెయిన్ రోడ్డు. రోడ్డు మీద ఒక వైన్ షాపు కమ్ బార్. ద్రవాన్ని విడిగా రెండు మూడు రెట్లు భారీ ఖరీదు చెల్లించి ఖరీదైన బార్లలో తాపీగా కూర్చుని సేవించే భాగ్యం లేని మామూలు మనుషులు ఆ



పెద్దిభొట్ల సుబ్బరామయ్య

షాపుకు విస్తారంగానే వస్తూ ఉండేవారు. లోపల గోడవారగా గుండెల ఎత్తున బల్లలు, మధ్య మధ్య స్టూల్స్. నిక్షేపంగా మామూలు రేట్లకే మందుకొట్టే సదుపాయం. ఆ మాస్టారి సలహామేరకు ఆ షాపుముందు మెట్లమీద చేరింది చిన్నమ్మ. ఎదురుగా ఎత్తు పీట మీద జర్మన్ సిల్వర్ బొచ్చెలో ఉడికించిన బఠాణీలు, వాటిని తినేందుకు వీలుగా స్పూన్లుగా పనికొచ్చే ఎండుటాకులు పెట్టుకుని బిచాణా పరిచింది. లోపల సర్వర్ కుర్రవాళ్లకు చిన్నమ్మ అంటే జాలి — అవిటిపిల్ల అని. వాళ్లు లోపల మందుకొట్టే మందుబాబులకు నంజుడుకు ఈ బఠాణీలు తీసుకుపోయి అందించేవారు. ఇదంతా చుక్కమ్మ అనుమతి తోనే జరిగింది.

చిన్నమ్మ ఆ రోజుల్లో సాయంకాలం అయ్యేసరికి మొహం కడుక్కుని జుట్టు దువ్వుకుని తయారయ్యేది. మధ్యాహ్నమే సిద్ధం చేసి ఉంచిన బఠాణీల బొచ్చెతో బుజ్జిగాడు వెంట రాగా కర్ర ఊతంతో రోడ్డు దాటి వైన్ షాపు ముందు మెట్లమీద ఒకేచోట స్థిరపడేది.

క్రమంగా పగలు అంతరించి చీకటి పడేసరికి ఒక్కొక్కొరుగా, ఇద్దరిద్దరుగా, ముగ్గురు ముగ్గురుగా రకరకాల జనం మెట్లెక్కి లోపలికి వెళ్లేవారు. పగటి బాధలు మరిచిపోయేందుకేమో దాహంగొన్నవారిలా ఎగబడేవారు. లోపల గోడవారగా బల్లలు, నిలబడి అర్జంట్‌గా మద్యసేవనం చేసే తొందర మనుషులకు — ఆ బాపతువారికి అన్నీ అర్జంటే. ఎక్కువసేపు ఉండలేరు. నిలకడ ఉండదు. సర్వర్ సీసా తెచ్చి ఇవ్వగానే మూత తీసేస్తూ, "నీళ్లు నీళ్లు" అని అరుస్తారు. నీళ్లు రాగానే గబగబా ద్రవాన్ని గ్లాసులోకి వంపుకుని నీళ్లుకలుపుకుని, అంత అర్జంటుగానూ గొంతులో పోసుకుని, మళ్లీ రెండోసారీ అంత తొందరగానూ నీళ్లు, ద్రవం కలుపుకుని గటగటమింగి ఏ సిగరెట్టో కాల్చుకుంటూ వెళ్లిపోయేవారు ఒక బాపతు. వీళ్ల వల్ల షాపువాడికి తప్ప చిన్నమ్మకు ఏమీ లాభం లేదు. అలా కాక, జంటలుగా వచ్చి కాసిని కబుర్లతో స్టూల్స్‌మీద కూర్చుని నింపాదిగా మధుపానం చేస్తూ అంత నింపాదిగానూ ధూమపానం చేస్తూ మధ్య మధ్య నంజుడుకు బఠాణీలు తెప్పించుకుని, మందు చాలక, మళ్లీ తెప్పించుకుని, బఠాణీలు చాలక మళ్లీ తెప్పించుకుని కబుర్లు తెమలక నింపాదిగా 'అనుభవించే'వారు కొందరు. వీళ్ల వల్ల షాపువాడికీ, బఠాణీల చిన్నమ్మకూ కూడా లాభమే. ఇలా రాత్రి పొద్దుపోయే వరకూ, పదకొండు గంటల వరకూ సాగేది వ్యాపారం. అప్పుడప్పుడు చిన్నమ్మ ఆశ్చర్యపోయేది. చిన్న సీసా యాభై, అరవై రూపాయలు పెట్టి ఎలా తాగగలుగుతున్నారు వీళ్లు? అంత డబ్బు వీళ్ల కెక్కడిది? అస లెందుకు తాగడం? వీళ్లు ఏం చేసి ఇంత డబ్బు సంపాయిస్తున్నారు? ఉపన్యాసాల్లో ఎన్నికలప్పుడు 'మనది పేద దేశమనీ, పేదరికాన్ని ప్రభుత్వమే పెంచి పోషించిందనీ' అంటూంటా రెందుకు?

ఖరీదైన కార్లలో తిరిగేవారికి, భారీగా డబ్బు తగలేసి వెర్రి సినిమాలు చూసే వెర్రి వెంగళప్పలకూ, పెద్దపెద్ద భవంతుల్లో ఉండేవారికి అలా అనే అధికారం ఉందా? తాను ఇన్ని గంటలు కూర్చుని బఠాణీలు అమ్మితే తనకు మిగిలేది ఎంత? పదో, ఎనిమిదో. అయితే ఆ సూత్రపుదానికే చుక్కమ్మ మురిసిపోతూ, 'అవిటిదైనా సంపాయించి పెడుతోంది పిల్ల'' అని పక్కవారితో అంటూ ఉండేది.

అయిందా?

అదుగో, ఆ జనవరి పదహారు. పండగ తర్వాత తన దశ మారిపోయింది. శని పట్టినట్టయింది. 'అంతా బంద్' అన్నారు. షాపులకు తాళాలు పడ్డాయి. మందుబాబులకు మందు తేలిగ్గా దొరక్క బాధ. తన కేమో సంపాదన పోయిందనీ, సవతి తల్లి ధోరణి మారిపోయిందనీ బాధ.

ఆనాడు ఎప్పుడో బఠాణీల ఉపాయం చూపించిన మాస్టారు ఇవ్వాళ మళ్లీ రోడ్డు మీద వెళ్తూ చిన్నమ్మను పలకరించాడు — "ఎలా ఉన్నావు?" అని అడిగాడు.

చిన్నమ్మకు కళ్లనీళ్ల పర్యంతమైంది.

సవతి తల్లి లోపల ఎక్కడో ఉన్నందువల్ల నెమ్మదిగానే అయినా సంగతంతా వివరించింది. తనకు ఇలా బతకాలని లేదన్నది. చచ్చిపోతే మేలన్నది.

ఆయన నవ్వాడు. "చూద్దాం! అంతలోనే చచ్చిపోతే ఎట్లా?" అంటూ వెళ్లిపోయాడు.

ఆ మరునాడు ఉదయమే విచిత్రం జరిగింది.

బుజ్జిగాడు బుట్టెడు పూలతో వచ్చాడు.

"మాస్టారు పిలిస్తే వెళ్లాను. ఇవి ఇప్పించారు. మాలగా కట్టి, సాయంకాలం వెళ్లి వంతెన పక్కన కూర్చోమన్నారు" అని చెప్పాడు.

చిన్నమ్మ పూలు ముందు పోసుకుని కూర్చుని మాల కట్టడం మొదలుపెట్టింది. సన్నటి చేతివేళ్లు అమిత నిపుణంగా కదిలాయి. అందాల పూలమాల మూరెడెత్తున తయారైంది. దానిమీద నీళ్లు చల్లి ఉంచింది.

చుక్కమ్మ అంతా చూస్తూనే ఉంది, మధ్యలో బుజ్జిగాణ్ణి అడిగి విషయం తెలుసుకుని లోలోపల సంతోషించింది కాని పైకి ఏమీ అనలేదు.

సాయంకాలం ఆఫీసులు మూసే వేళ ... జనం కొనుగోళ్లకు వచ్చేవేళ వెళ్లి వంతెన పేవ్‌మెంట్ మీద కూర్చుంది చిన్నమ్మ. ఎదురుగా పూలబుట్ట పెట్టుకుంది.

అటూ ఇటూ చాలామంది రకరకాల పళ్లూ, కూరలూ అమ్ముతున్నారు. అప్పుడు లిక్కర్ షాపు ముందు ఒంటరి ఒంటరిగా, ఇద్దరిద్దరుగా మనుషులు వచ్చినట్టు కాక, మరింత రద్దీ ఇక్కడ. ముఖ్యంగా ఆడ—మగ జంటలు, పిల్లా మేకతో ... రకరకాల వాహనాల మీదా, నడుస్తూనూ వచ్చారు. అవిటి పిల్లను గమనించి ప్రత్యేకించి ఆగి మరీ పూలు కొన్నారు. దేవాలయాలకు వెళ్లేవారు బేరమాడకుండా కొనుక్కుపోయారు. మొదటి సినిమా వదిలే వేళకు సరుకు ఖతమైపోయింది.

చిన్నమ్మ ఇంటికి చేరింది.

మాస్టారు వచ్చాడు. "పూలు పది రూపాయలు. ఇవ్వు" అన్నాడు.

చిన్నమ్మ డబ్బు లెక్క పెట్టింది. ఇరవై రూపాయలు పైన కొంచెం చిల్లర ఉంది.

"పది రూపాయలు నీ సంపాదన" అన్నాడాయన పది రూపాయలు తాను తీసుకుని.

"రోజూ బుజ్జిగాణ్ణి పంపించు, పూలు ఇప్పిస్తాను" అన్నాడాయన వెళ్లిపోతూ.

చిన్నమ్మ డబ్బు అంతా పిన్నమ్మ చేతిలో పోసింది.

పిన్నమ్మ డబ్బు చూసుకుని నవ్వింది.

బుజ్జిగాడు నవ్వాడు.

చిన్నమ్మ కూడా నవ్వింది. ●

# ఇల్లు ఖాళీ అయిన తర్వాత

ఉన్నన్నాళ్లూ ఉన్న 'వసతి గృహం' చివరికి ఖాళీ చేసి వెళ్లేటప్పుడు 'అద్దె కొంప' అంటున్న నిరసన మాటలు ముళ్లు గుచ్చుతాయి. తప్పదు.

దుమ్ము ధూళీ సమస్త కచడా అంతా చికాకుగా పట్టి పీడించిన చెద్ద పట్టుదలల్లా కలతపడిన కాంప్లికేటెడ్ నెట్‌వర్క్‌లా
ఇల్లంతా మనసంతటా బూజు
ఇదీ అని చెప్పేందుకు వీల్లేని చిరాకులా పట్టు వదలని బ్లీచింగ్‌తో కడిగిన సరిగా పోని పాకుడు
మీ రెంతంటే మీ రెంతనే అహంకారాల మధ్య వీడని మమకారాలు పసివాళ్లు

వర్గాల గురించీ వర్గాల గురించి అవమాన ప్రశ్నలూ, సిగ్గుపడే జవాబులూ సైతం తప్పవు చివరికి.

'ఒకసారి పగులు వచ్చాక సర్దుకోవటం కష్టం' అనేసిన యజమానురాలి తీర్పు తర్వాత —

సామాను సర్దినా మనసు సర్దుబాటు చేసుకోలేక బయటపడని మసక తెరల దృశ్యాలు

ఇవాళిది మనది, రేపు ఇంకోటి మనది. ఈ ఇళ్లు మారటం అర్థం కాని పసి ముఖాల్లో ప్రశ్నలు.

చాక్లెట్ రేపర్స్, పగిలిన పాలపీకలు, విరిగిన అట్ట బొమ్మలు, చిన్న తోపుడు బండీ

స్మృతులన్నిటినీ నిర్లిప్తంగా ఊడ్చిపారేసిన పనమ్మాయి.

'అది కాదు, ఇది కాదు, వేండా వెల్లం' తెలుగు మలయాళం కలగలిపిన తేనెల మాటలు.

ప్రతిరోజూ ఆయాచితంగా దొరికే తడి ఉమ్మలు తగిలిన స్మృతికి చెంపలు చెలమలై బాదంచెట్టు నీడలో ఆ నీడ అనుకున్నాక.

గుడియా ... ఆయిరే ఆయిరే హఁసీ కిరణ్‌కి లెహరాయీ ...!'

"ఎంతైనా వాళ్ల పిల్లలు మన పిల్లలు కాదమ్మాయిగారూ!" అనవసరమైన అర్థం లేని ఓదార్పు వాక్యాలు.

కఠిన సత్యాల అన్వయాలు

ఎమోషనల్‌గా కాక, ఇంటెలిజెంట్‌గా కనిపించాలనే భావ ప్రకటన ప్రాక్టీస్ చేస్తూ

ఇంకా కిలాడీతనం ఆవేశించని ఫ్రాగ్రెన్స్ ముఖాలు చూస్తూ వీడ్కోలు చెప్పాను!

(మా ఇంట్లో ఉండి వెళ్లిన చిన్నారి జిన్నీ, దినేష్‌ల కోసం)

శివలెంక రాజేశ్వరీదేవి

